A

అడల్ట్స్ ఓన్లీ కథ!

# మళ్ళీ మళ్ళీ పూసే పూలు

సుగంధ శ్రీనివాస్

చేతిలో కొత్త చీరతో, మనసులో ఆ చీరను తనకి నేనే కట్టాలన్న చిలిపి కోర్కెతో హుషారుగా ఇంటి ముందు వాలాను.

'ఏంటే? గీత తలుపు తీసే ఉంచింది' అనుకుంటూ ఇంట్లో అడుగుపెట్టిన వాడిని రెట్టింపైన ఆశ్చర్యంతో చూస్తూండిపోయాను ఆ చెప్పుల జతను.

'మా ఇంటికి ఎవరొస్తారు?' గుమ్మంలో క్షణమాగాను. ''గీతా... గీతా'' నేరుగా వంటింట్లోకి నడుస్తూ పిలిచా.

''ఇక్కడ...'' గార్డెన్ నుంచి గీత గొంతు. చీర కంటబడనీయకుండా దాచి అటు వైపు వెళుతున్న నాకు ఎదురైంది మరో వ్యక్తితో.

నా కళ్లను నేనే నమ్మలేక, పొరపాటున మరొకరింటికి వచ్చాననుకునేవాడిని ఎదురుగా గీత లేకుంటే! అతను గీత అన్నయ్య పవన్!

''హలో బావా! '' నవ్వుతూ విష్ చేశాడు.

''హ..హలో...'' తొట్రుపాటు పలకరింపు నాదైంది.


గీత ముఖంవైపు నా కళ్లు తిరిగాయి. అంచువరకు చేరిన ఆనందమా అన్నట్టు ముఖంపై ఆ నవ్వు మొగ్గలు. వంటింట్లో నుంచి కాఫీ తెచ్చింది.

పవన్ కబుర్లు చెప్పడానికి, నాతో మాట్లాడించడానికి తన ప్రయత్నాలన్నీ కుప్పగా పోస్తున్నాడు. నాకేమో ఎటూ అర్థం కాని పరిస్థితి. చిక్కు విప్పని చిలిపితనంతో గీత నా మనసును గాభరా పెట్టేస్తోంది.

★ ★ ★

''ఏమిటే ఈ ఎనిమిదవ వింత?'' అడిగాను స్నానం చేసి తల తుడుచుకుంటూ వంటింట్లో ఉన్న గీతతో. విననట్టే ప్రవర్తిస్తోంది. నేను ఉన్న కాసింత మెదడునూ ఏమిటి? ఎలా? అన్నట్టు ఇన్వెస్టిగేషన్‌కి వాడుకుంటూంటే తనేంటి? ఇంత నిర్లక్ష్యమా? మెడకి, భుజానికి మధ్య నా గెడ్డాన్ని ఆన్చి తలనాడించా కసిగా.

కళ్లు రెండే ఉండడం వల్ల బతికిపోయా. లేకపోతేనా చూపుతో నన్ను ఛిద్రాలు చేసేదే. ''అంత కోపమా'' కొంచెం దూరంగా జరిగి బతిమిలాడుతున్నట్టు ముఖం పెట్టి అడిగాను.



''ఎందుకురా అలా హైరానా పడతావ్? గుండె చూసుకో పొట్టలోకి జారింది'' కవ్విస్తున్నట్టు అంటూ చిన్న పోటు పొడిచింది. ఈ కాలం భార్యలకు భర్తంటే బొత్తిగా భయం భక్తీ లేకుండాపోయింది. సినిమాలు చూసి చెడిపోతున్నారని మీకనిపించవచ్చు. కానీ భర్తని చిన్నపిల్లాడిలా 'రా' కొట్టడం తనకైతే సరదా!

''అబ్బా...'' కాస్త బాధ నటించా పొట్ట చేత్తో పట్టుకుని.

''ఏయ్! గట్టిగా తగిలిందా'' అంటూ పనాపి నావైపు తిరిగింది ఆత్రుతగా. ఆమాత్రం చాలదూ మన చురుకుదనానికి. ముఖం చేతుల్లోకి వచ్చింది.

''ఛీ, సిగ్గు లేదు'' పారవశ్యం ప్రక్కనపెట్టి చిరుకోపం నాపైకి విసిరి వెనక్కి తోసింది. కన్నార్పకుండా చూస్తున్నాను. వచ్చినప్పటి నుంచీ పనెప్పుడవుతుందా టెప్పెప్పుడిస్తుందాని ఎదురు

చూస్తే ఈ రోజేంటి రాణిగార్కి!

''ఏంటా చూపు? నీ కళ్ళు బాగుంటాయన్న పాపానికి ఇలా చూపులతో ఎక్స్‌రే తీయడమేనా?'' అంది నడుముపై చేయి పెట్టుకుని.

''చంటాడు బాధపడతాడని ఓ 'ముద్దు' తినిపించొచ్చుగా'' అమాయకంగా ముఖం పెట్టి గునుగుతున్నట్టు అన్నాను.

''అన్నయ్య ఒక్కడే ఉన్నాడుగా కంపెనీ ఇవ్వ. ఇక్కడేదో రాజ్యాలు వెలగబెడుతున్నట్టు'' అంది మూతిని తిప్పుతూ. ఇష్టాన్ని వ్యంగ్యంగా మార్చేశక్తి ఆడవాళ్లదే సుమాని అనిపించింది.

''నాకేం అవసరం'' అంటూ కాస్త రాష్‌గా ముందుకొస్తుంటే-

''ఇదిగో అదే వద్దు'' అంది వేలెత్తి చూపిస్తూ.

''మరి చెప్పు''

నా వైపు తిరిగి నా రెండు బుగ్గలను చేతి వేళ్ల మధ్య బిగించి లాగుతూ- ''నన్ను తీసుకువెళ్లడానికి'' అంటూ కనుబొమ్మలెగరేస్తూ నా ముఖంపైకి ఊదింది. అలాగే చూస్తూండిపోయాను. హాల్లో పవన్ టీవీ చూస్తున్నాడు. అక్కడికెళ్లాలనిపించక మెట్లెక్కి పైకి చేరుకున్నా.

★ ★ ★

అప్పుడు నేను 'గౌతమి'లో బాటనీ చెప్పేవాడిని. అనిల్ సార్‌ను 'నిల్‌సార్' అంటూ ఆట పట్టించే గడుసు అమ్మాయి ఉండేది. తనే గీత!

వయసుకు మించి ఎదిగిన వ్యక్తిత్వం, ఎప్పుడూ నవ్వుతూ ఉండే కళ్లు నన్ను ఆశ్చర్యంలోకి తోసేసేవి.

మొదట ఓ ప్రైవేట్ క్లాస్ తీసుకున్నా తన మనసులో మాట చెప్పగానే! అయినా అదే పాట! మారలేదు మూడేళ్లయినా. చదువు పూర్తయి కాలేజ్ వదిలి వెళ్లిందని ఊపిరి పీల్చుకుంటే ఇంకా ముదిరి రోగాన పడింది.

''ఏంటీ ఆడపిల్ల అడిగితే అలుసా? లేక సమాజం కోసం ఆలోచిస్తున్నారా?'' అంటూ నిలదీసింది.

''అన్నీ తెలుసుకున్నావా నా గూర్చి?''

అవునన్నట్టు తలూపింది.

మర్నాడే గీత ఇంటికి వెళ్లాను.

నా మాటలు విని అవాక్కయ్యారు ఎంతో మామూలు విషయంగా నేనడగడం చూసి. కులాల గోడలు ఎవరు కట్టారో కానీ ఎంత దృఢంగా ఉన్నాయో తెలిసి వచ్చింది. గీత వైపు చూశాను. నవ్వుతోంది. ఎందుకు నవ్వుతోందో అర్థం కాలేదు. తర్వాత తెలిసింది.

గీత నాకంటే ధైర్యం కలది. నాపై నమ్మకంతో ఇంట్లో నుంచి బయటికొచ్చింది, తన వారందరినీ కాదని!

గుళ్లో పెళ్లి! రిజిస్ట్రరాఫీసులో సంతకాలు!

రూంకి వచ్చాక మొదట అడిగిన మాట ''జీవితాన్ని ఇంత సడెన్‌గా నిర్మించుకున్నారంటే నన్నెన్నేళ్లుగా ప్రేమిస్తున్నారు?'' ఆసక్తిగా చూస్తూ అడిగింది (బహువచనం వాడడం బహుశా ఇక్కడే చివరిసారేమో)

''ఇప్పటి నుంచే'' తల అల్లరిగా పక్కకి వంచి ఒక కన్ను మూసి అన్నాను. అంతే! అప్పుడే నా చెవులు తన చేతిలోకి, నా మెదడు ఆమె పరిధిలోకి వెళ్లాయి.

కష్టాలు ఇద్దరం కల్సే ఎదుర్కొన్నాం. తన 'ఫ్రీ అండ్ ఫ్రాంక్‌నెస్' బాగా నచ్చింది. జీవితం తన తోడుతో రసరమ్యహాసమై పూస్తూనే ఉంది. ఓసారన్నాను ''నా పేరు గిన్నీస్ బుక్ కమిటీకి నామినేట్ చేయాలనుకుంటున్నా- ప్రపంచంలో అత్యధిక ధనవంతునిగా''

''నిల్ సార్! కలలు కనమన్నారు కదాని మరీ ఇంత పచ్చిగా కనకండి. దేశ సరిహద్దు దాటడానికి కూడా సరిపోదు తమరి నెలజీతం. ధనవంతుడివెలా అవుతావు పోకిరి'' అంది వెక్కిరిస్తున్నట్టుగా.

''నువ్వే నా నిధి. నిన్ను మించిన సంపద నాకెక్కడిది'' అన్నాను చేతులు చెంపలకాన్చుకుని.

★ ★ ★

''ఇక్కడున్నావా?'' అంటూ గీత వచ్చింది మెల్లగా. ''ఏం ఆలోచిస్తున్నావ్?'' ఎదురుగా నిలబడింది, నా రెండు చేతులు తన భుజాలపై వేసుకుని.

నేనేమీ మాట్లాడ లేదు.

చేతులు నా నడుము చుట్టూ వేసి దగ్గరికి లాక్కుంది ''కోపంలో భలే ఉంటావ్'' అంటూ.

ఛాతీపై వెంట్రుకలను ముఖంతో చెల్లా చెదురు చేస్తూ పైకి చూసి ''నిన్ను పసిపిల్లాడిగా మార్చుకోడానికి నీకీ ముద్దు చాలదూ!'' అంటూ మునివేళ్లపై నిలబడి నుదురుపై ముద్దు పెట్టుకుంది. నేను ఇంకా బెట్టుచేయడానికన్నట్టు గుండెను తప్ప మరేదీ స్పందించనీయడం లేదు. పరీక్షగా తలపైకెత్తి చూసింది. నా నిరాసక్తత తనకి నిజమనిపించేలా కనబడిందేమో! తనను తానే విడిపించుకుని చేతులు ప్రక్కకి జరిపి వెళ్లిపోబోతోంది.

పమిట కొంగు చేతికి చేజిక్కించుకున్నాను.

''వదులూ...'' గింజుకుంటోంది, ముఖం నావైపు తిప్పకుండానే. వెనక నుండే దగ్గరికి లాక్కుని పొదివిపట్టి ముఖం నావైపు తిప్పుకుని ముద్దుల వర్షం కురిపించా ఊపిరాడకుండా. ఆపాను. లేని కోపం, ఉన్న ప్రేమ సమపాళ్లలో కలిపి చూసిన చూపునకు బ్రహ్మ నిపుణతకి మొకరిల్లాలనిపించింది.

## సెక్సీతారలు

**బాలీవుడ్‌లో అందంతో అదరగొట్టే హీరోయిన్ ఎవరిని అడిగితే చాలామంది శిల్పాశెట్టి పేరు చెప్తారు. అలాంటి శిల్పాశెట్టిని సెక్సీ హీరోలెవరని అడిగితే ముగ్గుర్ని ఎంపికచేసింది. 'సంజయ్‌దత్ చాలా సెక్సీగా ఉంటారు. ఆయనతో కలిసి నటించడం చాలా హేపీగా ఉంది. ఒక నిముషం ఆయన ఎంతో జాలీగా ఉంటారు. మరు నిముషం సీరియస్‌గా మారిపోతారు. నటన విషయంలో ఆయన సలహాల్ని నేనెంతగానో గౌరవిస్తాను' అంటోంది ఈ పొడుగుకాళ్ల సుందరి. ఇక ఆమె ఎంపికచేసిన రెండో సెక్సీ హీరో సల్మాన్‌ఖాన్, మూడో హీరో వివేక్ ఒబెరాయ్.**



''ఊఁ...'' కళ్లను ఎక్వేరియంలో తిరిగే చేపలా తిప్పుతూ. వెనక్కి తిరిగింది సొగసుగా. ఇంజనుకు బోగీలాగా నేనూ తనతో పాటే వచ్చాను.

★ ★ ★

''బావా నేనొచ్చింది మిమ్మల్ని ఇంటికి తీసుకెళ్ల డానికి. ఎల్లుండి నా ఎంగేజ్‌మెంట్''

వడ్డిస్తున్న గీతను అలాగే చూస్తూండిపోయాను. 'కల కాదు కదా' అనే అనుమానంతో. తనూ అలాగే చూపులు మార్చేసరికి ఇంకా ఆశ్చర్యపోయా. అంటే గీత ఊరికే చెప్పిన మాట నిజమే నన్నమాట.

''మీ పెళ్లి ఎవరికీ నచ్చకపోవచ్చు. మీరెన్నో కష్టాలు, కన్నీళ్లు చవిచూసి ఉండొచ్చు. మీపై అందరికీ అయిష్టత ఉండి ఉండొచ్చు. అది గతం. కాలం మనిషిని మారుస్తుంది. తనూ మారుతూ ఇప్పుడు మీరన్నా మీ జంటన్నా అందరికీ గౌరవం'' అంటూ ఆగి ''మిమ్మల్ని ఆదర్శంగా తీసుకునే నేనూ ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకోబోతున్నాను. అఫ్‌కోర్స్ సేమ్ క్యాస్టే'' అన్నాడు కళ్లలోకి చూస్తూ ఏమయినా కనబడుతుందేమోనని.

''గీతిష్టం'' అన్నాను మొహమాటం మర్చిపోయి. ''అన్నయ్యా! ఎవరూ మా గూర్చి పట్టించుకోకున్నా నువ్వయినా వచ్చావ్ నీ అవసరం కాబట్టి. మేమేం తప్పు పనిచేశామని ఇలా శిక్షిస్తున్నారు. పెళ్లి చేసుకుని ఆశీర్వాదం కోసం వస్తే ముఖం మీదే తలుపేసుకున్నారు. ఆరోజు నేనెంత ఏడ్చానో తెలుసా? మొదటి రోజే భార్య ఏడుపు చూసి తనెంత కలత చెందాడో ఊహించగలరా?'' వారించడానికన్నట్టు చెయ్యెత్తబోయా, అది మధ్యలో ఆగిపోయింది.

''ఆప్యాయతలకి దూరంగా కన్నవాళ్లని చూడకుండా ఉంటోందని క్రితం దీపావళికి వద్దంటున్నా వినకుండా నన్ను మనింటికి తీసుకొచ్చాడు. కనీసం ఒక్కరైనా పలకరించారా? మీ ఇంటికి కూతుర్నేగానీ ఆయన భార్యగా ఎందుకు చూడరు? ఇన్నాళ్లకి మేం కావాల్సి వచ్చామా? గౌరవం నాకే ఇవ్వడానికి నేను మిస్ గీతను కాదు, మిసెస్ గీతా అనిల్‌ను. మేము రాలేము'' ఉక్రోషంగా అంది గట్టిగా శ్వాస తీసుకుంటూ. నేను తన చేతిపై చేయేసిన సంగతి గమనించి నన్ను చూస్తోంది. ఆ కళ్లలో తడి మెరుపు.

పవన్ ముఖం చిన్నదైపోయింది. ఏమీ అనలేకపోయాడు. నాక్కాస్త ఇబ్బందనిపించింది ఇంటికొచ్చిన వ్యక్తినలా చివాట్లు పెట్టడం.

మళ్లీ పవన్ ''బావా! మిమ్మల్ని అవమానపరచిన మాట వాస్తవమే కానీ అదే మనసులో పెట్టుకుని నన్ను బాధపెట్టొద్దు. ఎలాగైనా గీతను ఒప్పించి..'' ఆగిపోయాడు.

''నేనా..'' అంటూ గీత వైపు చూసి ''అమెరికాను ఇండియా ఒప్పించడమూ? నాకంత అదృష్టం..'' వేడి సాంబారు నా చేతిపై పోయడంతో ఆపేశా. ఏమీ ఎరగనట్టు ఓరకంట నా బాధను చూసి కసిగా నవ్వింది. మరేం మాట్లాడకుండా ఊరుకున్నాడు పవన్. రాత్రి ఎవరి ఆలోచనలో వాళ్లం. నాలాగే వాళ్లిద్దరూ నిద్రపోలేదని నా నమ్మకం. పవన్ ప్రొద్దుట్టే వెళ్లిపోయాడు.

''నాన్నకి చెప్పు- ఇక్కడెవరూ పిలవగానే వచ్చి ఇంట్లో వాలడానికి సిద్ధంగా లేరని'' అంది వెళుతున్న వాడికి రాత్రి సంఘటన గుర్తుచేస్తూ. నా వైపు రెప్పవాల్చకుండా చూశాడు పాపం! ఆ చూపుకర్థం 'మా చెల్లిని మమ్మల్ని మరచిపోయేంతగా చూసుకుంటున్నందుకు థాంక్స్' అని నాకేం తెలుసు.

★ ★ ★

''గీతా నే చెప్పేది వినవా? '' టిఫిన్ వడ్డిస్తున్న తను ఏమిటన్నట్టు చూసింది. ''నువ్వు ఎన్నో ఆప్యాయతల మధ్య అనుబంధాల మధ్య పెరిగావ్. నాలాగా కాదుగా. వాళ్లు కావాలని 'బంధం' నిలుపుకోడానికి వస్తే..'' ఆపేశాను.

''భర్తను అవమానపరుస్తూంటే భార్యేలా ఊరుకుంటుందనుకుంటావ్. నన్నింకా వారి కూతురిగానే లెక్కగడుతున్నావా? నీ 'గీత'నన్న విషయం మరువద్దు. నా ఆనందం నీకెంత అవసరమో, నీ ఆత్మగౌరవం కాపాడ్డం నాకంతకంటే ఎక్కువ ముఖ్యం. ఏం మనకేం తక్కువ. నాకోసం నువ్వింత తపిస్తుంటే నీకోసం నేనీమాత్రం కఠినంగా ఉండకూడదా?''

''అవును. కానీ..'' ఇక వాదించి ప్రయోజనం లేదని ఆపేశా. కాలేజ్‌లో కూడా ఇవే ఆలోచనలు. ఎలాగైనా గీతను వాళ్లతో కలపాలి. ఈ చాన్స్ మళ్లీ రాదు. ఎంతగా గీత నా సాన్నిహిత్యం ఇష్టపడ్డా- పుట్టింటిపై ప్రేమ ఎలా తొలగిపోతుంది?

సాయంత్రం వచ్చింది మొదలు 'ఊఁ... ఆ'లతోనే సరిపెట్టుకుంటున్నా. రాత్రి పది దాటినా ముఖమైనా చూడకుండా కావాలనే ఉడికించా. నా ప్రేమ సామాన్యమైనదా అందుకే- ''ఏం సార్! కోపమా?'' అంటూ చనువుగా నా భుజంపై తన గడ్డాన్ని ఆనించింది. విననట్టే చదువుకుంటున్నా. క్షణాలు నిమిషం కాకముందే చప్పున వచ్చి వళ్లో వాలింది. ''ఏమైంది..'' అంటూ పుస్తకం లాక్కుంది. ''అలిగావా?'' ముద్దుగా అడుగుతూ మెడచుట్టూ చేతులేసింది.

''గీతా! ఒక మాట చెప్పనా?''

''ఆ ఒక్కటి తప్ప మరేదైనా'' ఊరికెళ్లటం మినహాయించి అన్నట్టు అంది.

''అదే... నీకిప్పుడు నేనొక్కడినే సర్వస్వం అనిపించవచ్చు. మరెవరితోనైనా అవసరం అనవసరం అనిపించవచ్చు. కానీ కాలం ఒకేలా ఉండదుగా. నేనెలాగూ ఒంటరినే..'' ఒక్క క్షణం ఆగాను. ''అందుకే ఇతరులతో సంబంధాలు అవసరం. మన వాళ్లంటూ ఎవరూ లేకుండా బ్రతకడానికి ఈ ప్రపంచం కేవలం మనకే ఉద్దేశించింది కాదు. ఇది సమాజం. కావాలని దగ్గరికొస్తున్న మీ వాళ్లని మన వాళ్లుగా మార్చుకుంటే తప్పుకాదు'' చెప్పుకుంటూ పోతున్నాను. ''ఇంకా చెప్పు'' అంది నన్ను కాస్త హత్తుకుని.

''సమాజానికి ఆమోదయోగ్యం కాని దాంట్లో ప్రేమొకటి. సమాజం మన కోసం రాదు. మనమే సమాజంలోకి ఎంత త్వరగా వెళితే అంత మంచిది. మీ వాళ్లతో కలిస్తే మనం రెండోసారి గెలిచినట్టు'' అని ఆగాను.

తదేకంగా నన్నే చూస్తోంది. ''అందుకే నువ్వు నాకు నచ్చావ్'' అంది బుగ్గ గిల్లుతూ. ''నీ మూలంగా ప్రేమ పేరుతో తల్లిదండ్రుల ప్రేమకు దూరమయ్యాయనని వారి ప్రేమ లోటు తెలిసిన నీవు నాకు ఆ లోటు రావద్దని ఎంతగా పరితపిస్తున్నావ్! నిన్ను అవమానపరచి, నీ గౌరవం దెబ్బతినేలా ప్రవర్తించినా నీకేమాత్రం కోపం లేదు. ఉన్నా నాపై నీకున్న ప్రేమ దాన్ని జయించి ఉంటుంది. కదూ'' అంది. మౌనం నా భాషైందంటే- మనసు తన వశమైనట్టే. చూస్తూ ఉండిపోయా.

''సరే! రేపుదయం వెళదాం'' అంది.

''నిజంగా'' అన్నాను నమ్మలేనట్టు.

''ఆ, నిల్ అబద్ధంగా!'' అంది మీసాలు పట్టి లాగుతూ అల్లరిగా.

చేతుల్లోకి ముఖం తీసుకుని ముద్దివ్వడానికి సమాయత్తమవుతోంటే చక్కిలిగింతలు పెట్టింది. ఇద్దామనుకున్న ముద్దు చెల్లాచెదురైంది.

చెదిరిన ముద్దును ముద్దగా చేసి నా ముఖాన్ని అపురూపంగా తన చేతుల్లోకి తీసుకుని నుదురుపై నిలిపింది.

తనువంతా పూస్తున్న పువ్వులాగా పులకరించిపోయింది.

☆

